మేడ్చల్ వైద్య విద్యార్థికి పర్యావరణ పురస్కారం

పురస్కారం అందుకున్న మర్రి శ్రేయారెడ్డి(ఎడమవైపున)

మేడ్చల్, జూలై 5 : మేడ్చల్ పట్టణానికి చెందిన వైద్య విద్యార్థికి అంతర్జాతీయ పర్యావరణ పురస్కారం లభించింది. బీహార్ రాష్ట్రం పాట్నాలోని ఎయిమ్స్ విశ్వవిద్యాలయంలో పీజీ చదువుతున్న మేడ్చల్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మర్రి దీపికానర్సింహారెడ్డి కుమార్తె శ్రేయారెడ్డికి ఈ పురస్కారం లభించింది. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల రోజుల పాటు పర్యావరణ పరిరక్షణపై వివిధ అంశాలపై అంతర్జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన శ్రేయారెడ్డి ఎయిమ్స్ వీసీ నీలోత్పల్‌భల్ నుంచి పురస్కారాన్ని అందుకున్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

- మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్
- ఉప్పల్ పీహెచ్‌సీ, మల్కాజిగిరి ఏరియా దవాఖానలో తనిఖీలు

రామంతాపూర్, జూలై 5 : వివిధ సమస్యలతో దవాఖానకు వచ్చే రోగులకు మెరుగైన చికిత్స అందించాలని, డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉండాలని మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. శుక్రవారం ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అన్ని వార్డులను, ఓపీ, ల్యాబ్, ఐసీయూ, ఆక్సిజన్, ఎక్స్‌రే, ప్రసూతి గదులను, నవజాత శిశు కేంద్రాన్ని సునిశితంగా పరిశీలించారు. అక్కడి పరిస్థితులను రోగులను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్లు, వైద్య సిబ్బంది సేవలను పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోజుకు ఎన్ని ప్రసవాలు జరుగుతున్నాయని తెలుసుకుని, సంఖ్య పెరిగేలా చూడాలని వైద్యసిబ్బందికి సూచించారు. హైరిస్కు ఉన్న కేసులను గాంధీ దవాఖానకు పంపాలని పేర్కొన్నారు. స్కానింగ్ కోసం స్లాట్స్ బుక్ చేసుకునే విధానాన్ని వైద్య సిబ్బంది కలెక్టర్‌కు సూచించారు. ఫార్మసీలో మందుల నిల్వలను కలెక్టర్ పరిశీలించారు. వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా నుంచి ప్రజలను కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని డాక్టర్లకు సూచించారు.

మల్కాజిగిరి ఏరియా దవాఖానలో..

మల్కాజిగిరి : పేదలకు మెరుగైన వైద్య సేవలందించాలని కలెక్టర్ గౌతమ్ అన్నారు. శుక్రవారం మల్కాజిగిరిలోని ఏరియా దవఖానను మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్ గౌతమ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దవఖానలో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. రోగులకు ఇబ్బందులు కలుగకుండా ఓపీ, ల్యాబ్, ఎక్స్‌రే, ఐసీయూ, లెబర్ రూమ్, నవజాతి శిశువు కేంద్రంలో సిబ్బంది మెరుగైన సేవలు అందించాలని అన్నారు. వర్షాకాలంలో మలేరియా,డెంగీ వ్యాధుల పట్ల

ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

అప్రమత్తంగా ఉండాలన్నారు. దవఖానలో పరిసర పారిశుధ్యం మెరుగుపరచాలని సూచించారు. కార్యక్రమాల్లో డీఎంహెచ్ఓ డాక్టర్ రఘునాథస్వామి, డీసీహెచ్ కోట్యానాయక్,సౌందర్యలత, మల్కాజిగిరి డీఎంహెచ్ఓ ఆనంద్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ సునీత, సంగీత్, పద్మావతి, సంధ్యారాణి, గీత, చంద్రకళ, పాల్గొన్నారు.

పల్లె దవాఖాన కోసం కలెక్టర్‌కు వినతి

మల్లాపూర్ : డివిజన్‌లోని అశోక్‌నగర్ బస్తీకి మంజూరైన పల్లె దవాఖానను వేరే డివిజన్‌కు తరలించడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ బస్తీలోనే పల్లె దవాఖాన ఏర్పాటు చేయాలని శుక్రవారం అశోక్‌నగర్ బస్తీ నాయకులు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్, మండల వైద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బోదాసు లక్ష్మీనారాయణ, మొసలి శ్రీనివాస్ రెడ్డి, మైలారం నాగేందర్, విక్టరీ, జోష్, రాము, తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తా..

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

మల్లేశ్‌కు ఎల్ఓసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

రామంతాపూర్, జూలై 5: పేదల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం ఉప్పల్ డివిజన్ సరస్వతీకాలనీకి చెందిన మల్లేశ్ కుమారుడికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన ఎల్ఓసీ పత్రాన్ని ఎమ్మెల్యే అతడి ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తున్నానన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మేకల మధుసూదన్‌రెడ్డి, ప్రవీణ్ ముదిరాజ్, మహేందర్, మేఘమాల, కిశోర్, కిరణ్, నిరంజనాచారి, శ్రీనివాస్,మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అనంతరం అమావాస్య సందర్భంగా ఉప్పల్ భగాయత్‌లోని కాలభైరవస్వామికి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.

రేపు కుమ్మర్ల తొలి బోనాలు

కుమ్మరులు భారీగా తరలిరావాలి
రేపాక రాంబాబు, సిలివేరు వెంకటేశ్

అంబర్‌పేట, జూలై 5: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లో బోనాల పండుగ సందడి ప్రారంభం కానుంది. ఈనెల 7న కుమ్మర్ల తొలి బోనాల జాతరను నిర్వహించనున్నట్లు బోనాల జాతర వ్యవస్థాపకులు రేపాక రాంబాబు, సిలివేరు వెంకటేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న ట్యాంక్‌బండ్ శ్రీశ్రీశ్రీ కనకాల కట్టమైసమ్మకు ఆనవాయితిగా వస్తున్న 501 బోనాలను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించనున్నట్లు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం ప్రారంభం కానున్న ఈ కార్యక్రమానికి హైదరాబాద్‌తోపాటు రాష్ట్రం లోని కుమ్మర్లంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బోనాలను కుండల్లోనే తయారు చేయాలన్నారు. రాష్ట్రంలోని అమ్మవారి దేవాలయాల్లో కుమ్మర్లనే పూజార్లుగా నియమించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

మల్కాజిగిరి అభివృద్ధిని అడ్డుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

- అధికారుల తీరుపైనా గౌతమ్‌నగర్ కార్పొరేటర్ మేకల సునీత మండిపాటు

నేరేడ్‌మెట్, జూలై 5: ప్రజల కోసం నిరంతరం పనిచేస్తున్న మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కాంగ్రెస్ నాయకులు అడ్డుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని గౌతంనగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీతా రాముయాదవ్ అన్నారు. శుక్రవారం బీఆర్ఎస్ డివిజన్ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి కార్పొరేటర్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి గత ఏడు నెలలుగా నియోజకవర్గంలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. ఇటీవల మౌలాలి ఆర్టీసీ కాలనీలో అధికారులతో కలిసి పర్యటించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కొందరు కాంగ్రెస్ నాయకులు అడ్డుకోవడం హేయమని అన్నారు. కొందరు అభివృద్ధి పనులు చేయవద్దని అధికారులు, ప్రజలను భయబ్రాంతులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. అధికారులు కూడా అధికార పార్టీ నాయకుల మాటలు విని వారికి వత్తాసు పలుకుతున్నారని మండిపడ్డారు. దిగజారుడు రాజకీయాలు మాని మల్కాజిగిరి అభివృద్ధిలో భాగస్వాములు

గౌతమ్‌నగర్‌లో విలేకరులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సునీత, బీఆర్ఎస్ నాయకులు

కావాలని కోరారు. మైనంపల్లి హన్మంతరావుకు మల్కాజిగిరి అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే అభివృద్ధికి సహకరించాలని కోరారు. అధికారులు ఇప్పటికైనా మల్కాజిగిరి అభివృద్ధికి కృషి చేయాలని హితవు పలికారు. కార్పొరేటర్ వెంట మాజీ కార్పొరేటర్ జగదీశ్‌గౌడ్, బద్దం పరశురాంరెడ్డి, జేఏసీ వెంకన్న, జీకేహన్మంతరావు, ఉపేందర్‌రెడ్డి, రాముయాదవ్, అంజయ్య, మధుసూదన్‌రెడ్డి, ఉస్మాన్, శ్రీనివాస్, వరుణ్‌తేజ్‌తోపాటు పలువురు నాయకులు, ఉద్యమకారులు ఉన్నారు.

భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలి

అమ్మవారి బోనాలకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని గౌతంనగర్ కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్ అన్నారు. శనివారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శానిటేషన్, రాంకీ గ్రూప్, ఇతర అధికారులతో కార్పొరేటర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ నెల 28న నిర్వహించనున్న బోనాల పండుగకు అమ్మవారి దేవాలయాలు, పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జీహెచ్ఎంసీ పారిశుధ్య సూపర్‌వైజర్లు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మేకల రాముయాదవ్, జీహెచ్ఎంసీ పారిశుధ్య సూపర్‌వైజర్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పోటీ ప్రపంచంలో రాణించాలి

- డిప్యూటీ సీఎం సతీమణి నందిని

మారేడ్‌పల్లి, జూలై 5: నేడు సాంకేతిక రంగం, విద్యారంగంలో నేటి అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు మారుతూ పోటీ ప్రపంచంలో విజయాలు సాధించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి నందిని మల్లు అన్నారు. శుక్రవారం మడ్‌ఫోర్ట్ ప్రభుత్వ పాఠశాలకు బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ చైర్మన్ కృష్ణ పాడిశెట్టి ఆధ్వర్యంలో అబిబస్ సహకారంతో 10 కంప్యూటర్ల పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యా రంగానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తున్నదని తెలిపారు. పాడైపోయిన కంప్యూటర్లు మా సంస్థకు ఇస్తే వాటిని రిపేర్ చేసి, కొన్ని సాఫ్ట్‌వేర్‌లను అమర్చి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేస్తామని తెలిపారు.

ఉప్పల్ ఇండోర్ స్టేడియాన్ని పరిశీలించిన జడ్సీ

రామంతాపూర్, జూలై 5: ఉప్పల్ సర్కిల్‌లోని ఇండోర్ స్టేడియంను శుక్రవారం ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ పాటిల్ సందర్శించారు. పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు, స్పోర్ట్స్ ఏడీ వెంకట్‌రెడ్డి, డీఈ చందన, శానిటరీ సూపర్‌వైజర్ రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పవర్ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం పెంపు

మేడ్చల్, జూలై 5 : శామీర్‌పేట మండలం లాల్‌గడీమలక్‌పేటలో 132 కేవీ సబ్‌స్టేషన్‌లో ఉన్న ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యాన్ని పెంచనున్నట్లు డీఈ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. సబ్‌స్టేషన్‌లో 50 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యాన్ని 80 ఎంవీఏకు పెంచుతామని తెలిపారు. రూ.6 కోట్లతో కొత్త పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు.

శుక్రవారం పనులు ప్రారంభించామని ఈనెల 10 వరకు పూర్తి చేస్తామని పేర్కొన్నారు. కొత్త పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో తుర్కపల్లి జీనోమ్ వ్యాలీ, శామీర్‌పేట, మూడుచింతపల్లి, మేడ్చల్ మండలాల్లోని గృహ, వాణిజ్య, పారిశ్రామిక వినియోగదారులకు ప్రయోజనం చేకూరుతుందని డీఈ వివరించారు. పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చనున్నందున సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

మేడ్చల్‌లో గంజాయిని అరికట్టాలి

సీఐ సత్యనారాయణకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

మేడ్చల్, జూలై 5 : మేడ్చల్‌లో గంజాయి వినియోగాన్ని అరికట్టాలని మేడ్చల్ జిల్లా సాధన సమితి నాయకులు శుక్రవారం సీఐ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మేడ్చల్‌లో యువత, విద్యార్థులు గంజాయితోపాటు మద్యానికి బానిసలుగా మారి ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ తల్లిదండ్రులకు తీరని వ్యధను మిగులుస్తున్నారన్నారు. పట్టణంలో పోలీస్ గస్తీని పెంచడంతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, బస్తీల్లో విద్యార్థులకు, ప్రజలకు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వ హించాలని కోరారు. ఎస్సైల పర్యవేక్షణతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి పూర్తిగా గంజాయిని అరికట్టాలని పేర్కొ న్నారు. కార్యక్రమంలో పాతూరి సుధాకర్ రెడ్డి, రఘురాం, వంశీ వంజరి తదితరులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేయాలి

అల్వాల్‌లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు శుక్రవారం అంబేద్కర్‌నగర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో వెంకటేశ్, నవీన్, ప్రదీప్, ఆనంద్, అజయ్‌రెడ్డి, పర్వతాలు, గణేశ్, శ్రీనివాస్, సుజాత, కరుణశ్రీ, పద్మిని, సుదర్శని, అనురాధ తదితరులు పాల్గొన్నారు. - మల్కాజిగిరి, జూలై 5

మొక్కలు నాటిన కౌన్సిలర్

మొక్క నాటుతున్న కౌన్సిలర్ లావణ్యారెడ్డి

మేడ్చల్, జూలై 5 : ఆర్టికల్ 370 రద్దుకు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ పోరాడి అసువులు బాశారని మేడ్చల్ మున్సిపాలిటీ కౌన్సిలర్ లావణ్యాహనుమంత్‌రెడ్డి అన్నారు. శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకొని గిర్మాపూర్‌లో శుక్రవారం కౌన్సిలర్ లావణ్యాహనుమంత్‌రెడ్డి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ దేశానికి ఎనలేని సేవలందించారని అన్నారు. అదేవిధంగా ప్రధాని మోదీ మన్‌కీ బాత్ కార్యక్రమంలో తల్లుల గౌరవార్థం మొక్కలు నాటాలని ఇచ్చిన పిలుపు మేరకు వార్డు పరిధిలో మొక్కలు నాటినట్టు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆంజనేయులు ముదిరాజ్, రాఘవరెడ్డి, మల్లారెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, వంశీరెడ్డి, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కడుపునొప్పితో లారీ డ్రైవర్ మృతి

జవహర్‌నగర్, జూలై 5: కడుపునొప్పితో లారీడ్రైవర్ మృతి చెందిన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధి బాలాజీనగర్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురానికి చెందిన ఢిల్లీరావు(38) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. నేపాల్ నుంచి చీపురుకట్టల లోడు లారీ విజయవాడకు వచ్చింది. విజయవాడ నుంచి ఢిల్లీరావు లారీని నడుపుకుంటూ జవహర్‌నగర్ కార్పొరేషన్ కేసీఆర్ కూరగాయాల మార్కెట్ సమీపంలోని మైదానానికి చేరుకున్నాడు. నగరానికి చేరుకునే సమయంలోనే కడుపునొప్పి వస్తుందని క్లీనర్‌కు చెప్పాడు. మాత్రలు మింగి ఈనో తాగినా కడుపునొప్పి తగ్గలేదు. ఈ క్రమంలో కార్మికులు చీపురు కట్టల లోడు దించుతుండగా డ్రైవర్ లారీలో పడుకుంటానని వెళ్లాడు.

లోడు ఖాళీ చేసిన తర్వాత క్లీనర్ డ్రైవర్‌ను లేపగా అప్పటికే నురగలు కక్కి చనిపోయి కనిపించాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖానాకు తరలించారు. అనంతరం కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత ఆత్మహత్య

మౌనిక (ఫైల్)

మల్కాజిగిరి, జూలై 5: అనుమానాస్పద స్థితిలో గృహిణి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ కథనం ప్రకారం... మారుతీ నగర్‌కు చెందిన ఈశ్వర్‌కు 12 ఏండ్ల క్రితం మౌనిక(30)తో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మౌనిక ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. మౌనిక మృతికి భర్త వేధింపులే కారణమని బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

రామంతాపూర్,జూలై 5 : అనారోగ్యంతో బాధపడుతూ దవాఖానలో చికిత్స పొందుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంపాల పద్మారెడ్డిని శుక్రవారం ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి పరామర్శించారు. పద్మారెడ్డి ఆరోగ్య వివరాలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు.

దోమల నివారణపై అవగాహన

బన్సీలాల్‌పేట్, జూలై 5 : ఇండ్ల పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దోమలను నివారించడం మన అందరి బాధ్యత అని జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగం ఏఎఫ్ఏ రాజేందర్‌రెడ్డి అన్నారు. 'ఫ్రై డే -డ్రై డే' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం భోలక్‌పూర్‌లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇంటి పైకప్పులో పాతటైర్లు, కూలర్లు, కొబ్బరి బోండాం లాంటి వాటిలో నీరు నిల్వ ఉండడం వలన అందులో లార్వా నుండి దోమలు ఉత్పత్తి అవుతాయని ఆయన వివరించారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎం.శ్రీనివాసులు, ఎంటమాలజీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పార్టీలకతీతంగా పరిష్కరించాలి

- పోచారం మున్సిపల్ సమావేశంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్
- పలు అభివృద్ధి పనులకు పాలకవర్గం ఆమోదం

మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్, మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి, కమిషనర్ వేమనరెడ్డి

ఘట్‌కేసర్, జూలై 5: కౌన్సిలర్లు ఏ పార్టీకి చెందిన వారైనా ఆ ప్రాంత ప్రజల సమస్యలను పార్టీలకతీతంగా పరిష్కరించాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శుక్రవారం పోచారం మున్సిపల్ చైర్మన్ బి.కొండల్‌రెడ్డి అధ్యక్షతన పాలకవర్గం సాధారణ సమావేశం జరిగింది. సమావేశానికి ఎంపీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజాప్రతినిధులు నిత్యం ప్రజల్లో ఉండి సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలన్నారు. తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎంపీ పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ రోడ్డు ఎన్‌టిపీసీ చౌరస్తా వద్ద ప్రమాదాలను నివారించేందుకు బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని, మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని ఎంపీ ఈటలకు చైర్మన్ కొండల్‌రెడ్డి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.

అంతకుముందు పోచారం మున్సిపాలిటీలో రూ.1 కోటి 93 లక్షలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు పాలకవర్గం ఆమోదం తెలిపింది. ప్రతి వార్డులోని ప్రజల మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. మున్సిపాలిటీలోని 18 వార్డుల్లో సీసీ, బీటీ రోడ్ల నిర్మాణం, భూగర్భ డ్రైనేజీ కాల్వల నిర్మాణం, పారిశుధ్య సామగ్రి కొనుగోలు పనులు చేపట్టాలని పాలకవర్గం తీర్మానించింది. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వేమనరెడ్డి, వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కౌన్సిలర్లు మహేశ్, ధనలక్ష్మి, రాజశేఖర్, సాయిరెడ్డి, శైలజ, బాల్‌రెడ్డి, వెంకటేశ్ గౌడ్, లక్ష్మి, హరిప్రసాద్‌రావు, శ్రీలత, సరిత, పోచమ్మ, సుధాలక్ష్మి, మమత, కోఆప్షన్ సభ్యులు, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయాలి: కార్పొరేటర్

రెడ్డికాలనీలో వివిధ విభాగాల అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

చర్లపల్లి, జూలై 5 : చర్లపల్లి డివిజన్ పరిధిలో బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి పేర్కొన్నారు. చర్లపల్లి డివిజన్ పరిధి రెడ్డికాలనీలో బోనాల ఏర్పాట్లపై వివిధ విభాగాల అధికారులతో కార్పొరేటర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లో సుమారు 35 అమ్మవారి ఆలయాలు ఉన్నాయని, బోనాల సందర్భంగా ఆలయాల వద్ద భక్తులకు అన్ని వసతులు కల్పించాలని సూచించారు. తాగునీరు, రహదారులు, పారిశుధ్య పనులను వేగవంతం చేయాలని ఆమె అధికారులకు సూచించారు.

మాజీ మేయర్ జన్మదిన వేడుకలు

గ్రేటర్ హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ జన్మదిన వేడుకలను శుక్రవారం డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో ఘనంగా నిర్వహించారు. బీఎన్‌రెడ్డి కాలనీలో వృద్ధులకు పండ్లు, దుప్పట్లు పంపిణీ చేయడంతో పాటు ఉన్నత విద్యకోసం విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా రక్తదాన కార్యక్రమం నిర్వహించడంతో పాటు పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు నాగిళ్ల బాల్‌రెడ్డి, బొడిగె ప్రభుగౌడ్, రాజుగౌడ్, భానుచందర్‌తోపాటు కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కార్మిక హక్కులను పట్టించుకోని ప్రభుత్వాలపై పోరాడదాం..

- ఆశావర్కర్స్ యూనియన్ సీఐటీయూ సెక్రటరీ రేవతి కల్యాణి

కార్మికుల కోరికల దినం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆశావర్కర్స్ యూనియన్ సీఐటీయూ సెక్రటరీ రేవతి కల్యాణి

జవహర్‌నగర్, జూలై 5: లేబర్ కోడ్‌లను అమలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలని తెలంగాణ ఆశావర్కర్స్ యూనియన్ సీఐటీయూ సెక్రటరీ రేవతి కల్యాణి అన్నారు. ప్రధాని మోదీ కార్మికుల హక్కులను పట్టించుకోవడంలేదని దుయ్యబట్టారు. జులై 10న కార్మికుల కోరికల దినం పాటించాలని కోరుతూ జవహర్‌నగర్ కార్పొరేషన్ ప్రభుత్వ ప్రాథమిక దవాఖానాలో ఆశా కార్యకర్తల ఆధ్వర్యంలో శుక్రవారం వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రేవతి కల్యాణి మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా 15 ఏండ్లుగా పనిచేస్తున్న ఆశా కార్యకర్తలకు పరీక్షలు నిర్వహిస్తామనడం విడ్డూరంగా ఉందని, కార్పొరేట్ కంపెనీలకు కొమ్ము కాస్తూ కార్మికుల న్యాయమైన హక్కులను కాలరాయ చూస్తున్న కేంద్ర ప్రభుత్వానికి సెగ తగిలే విధంగా జులై 10న ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

తెలంగాణ ప్రభుత్వం 6 గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పి ఆరు నెలలు గడుస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నాయే తప్ప ప్రజలకు చేసిందేమీలేదని మేడ్చల్ జిల్లా సీఐటీయూ కోశాధికారి ఉన్నికృష్ణన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రాధ, రాణి, శిల్ప, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీ ఈటల పూజలు

శివశంకర మహమ్మాయి ఆలయంలో పూజల్లో పాల్గొన్న ఎంపీ ఈటల

రామంతాపూర్,జూలై 5 : జ్యేష్ఠ మాసం అమావాస్యను పురస్కరించుకుని శుక్రవారం ఉప్పల్ శివశంకర మహమ్మాయి ఆలయంలో ఎంపీ ఈటల రాజేందర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎంపీ ఈటలను ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి,బలవంతాచారి,శామీర్‌పేట ధర్మారెడ్డి, రమేశ్, ఫణీందర్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మరకత శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో..

మల్కాజిగిరి, జూలై 5: అల్వాల్ సర్కిల్ కానాజీగూడలోని మరకత శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో శుక్రవారం బ్రహ్మశ్రీ డాక్టర్ మోత్కూరు సత్యనారాయణశాస్త్రితోపాటు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మహమహోపాధ్యాయ బ్రహ్మశ్రీ డాక్టర్ దోర్బల ప్రభాకరశర్మ, దోర్బల కుమారస్వామి, అవధారి బ్రహ్మశ్రీ డాక్టర్ అయాచితం నటేశ్వర శర్మ, దర్శనమ్ సంపాదకులు వెంకటరమణశర్మ, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎంపీని కలిసిన గడ్డం రవికుమార్



కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా ఎంపీ రాధాకృష్ణను శుక్రవారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గడ్డం రవికుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. - రామంతాపూర్